
సాక్షి వికారాబాద్

మంగళవారం । 19 । నవంబర్ । 2024



జన జాతర ప్రాంగణం ఖాళీ

ఆరు రోజుల పాటు జరిగిన మెథడిస్ట్ క్రైస్తవ జాతర ఆదివారంతో ప్రశాంతంగా ముగిసింది. 8లో ▸



మాలలపై చిన్నచూపు

అన్ని రాజకీయ పార్టీలు మాలలను చిన్న చూపు చూస్తున్నాయని చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి ఆరోపించారు. 8లో ▸



అధ్యాపకుల కొరత

పేద విద్యార్థుల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేజీబీవీలను అధ్యాపకుల కొరత వేధిస్తోంది. 9లో ▸

న్యూస్‌రీల్

21న రిజర్వేషన్లపై బహిరంగ విచారణ

అనంతగిరి: రాష్ట్రంలో స్థానిక సంస్థల వారీగా కల్పించాల్సిన రిజర్వేషన్లపై ఈనెల 21న రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో బహిరంగ విచారణ ఉంటుందని కలెక్టర్ ప్రతీక్‌జైన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన బీసీ సంఘాలు, సంచార జాతులు, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల నుంచి కమిషన్ సభ్యులు సలహాలు, సూచనలు తీసుకుంటారని పేర్కొన్నారు.

డిప్లొమా కోర్సులకు దరఖాస్తు గడువు పెంపు

వికారాబాద్ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మల్లికార్జున్



అనంతగిరి: వికారాబాద్ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో రెండేళ్ల డీఎంఎల్‌టీ, డీడీఐఏఎల్‌వై కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తు గడువు పొడిగించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మల్లికార్జున్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. డిప్లొమా ఇన్ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్, డిప్లొమా ఇన్ దయాలసిస్ టెక్నీషియన్ కోర్సులకు ఈ నెల 20 వరకు ఇంటర్ బైపీసీ పూర్తి చేసిన వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. బైపీసీ విద్యార్థులు లేని యెడల ఎంపీసీ, ఇతర గ్రూపలలో ఇంటర్ పూర్తి చేసిన వారు దరఖాస్తుకు అవకాశం కల్పిస్తున్నామన్నారు. మరన్ని వివరాలకు జీఎంసీవికారాబాద్.ఓఆర్‌జీ వెబ్‌సైట్ పరిశీలించాలన్నారు.

త్వరలో బీజాపూర్ రహదారి విస్తరణ పనులు

చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డి

చేవెళ్ల: అప్పా జంక్షన్ నుంచి మన్నెగూడ వరకు హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారి విస్తరణ పనులు త్వరలోనే ప్రారంభమవుతాయని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డి అన్నారు. నగరంలోని తన నివాసంలో సోమవారం బీజాపూర్ జాతీయ రహదారి విస్తరణ పనుల పురోగతిపై ఎన్‌హెచ్‌ఏఐ ప్రాజెక్టు డైరెక్టర్ నాగేశ్వరరావు, ఆర్ అండ్ బీ ఈఈ ధర్మారెడ్డి, ఇతర అధికారులు, చేవెళ్ల ప్రాంత బీజేపీ నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రోడ్డు విస్తరణ పనుల ఆలస్యానికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరగా పనులు ప్రారంభించి రోడ్డు ప్రమాదాల బారి నుంచి ప్రజలను కాపాడాలని అధికారులకు సూచించారు. రెండు వారాల్లో పనులు ప్రారంభించి యుద్ధ ప్రాతిపదికన రోడ్డు విస్తరణ పనులు చేపడతామని అధికారులు తెలిపారు. చేవెళ్ల బైపాస్ వద్ద ఉన్న శ్మశానవాటిక దగ్గర అండర్‌పాస్ ఏర్పాటు చేయాలని గ్రామస్తులు ఎంపీకి వినతిపత్రం అందజేశారు. చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కార్తీక దీపాలు వెలిగిస్తున్న అనంతగిరి పరిరక్షణ సమితి సభ్యులు

వైభవంగా పెద్ద జాతర

అనంతగిరి గుట్ట శ్రీ అనంతపద్మనాభ స్వామి ఆలయంలో కార్తీక మాస పెద్ద జాతర ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. సోమవారం స్వామి వారిని గజవాహనంపై మాఢ వీధుల్లో ఊరేగించారు. ఆలయ పరిసరాలు భక్తులతో కిటికిటలాడాయి. అనంతరం భక్తులకు పద్మనాభ స్వామి దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం అనంతగిరి పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో కార్తీక దీపోత్సవం నిర్వహించారు.

– అనంతగిరి



గజ వాహనంపై ఊరేగుతున్న పద్మనాభ స్వామి

పరిగి డీఎస్పీగా శ్రీనివాస్



పరిగి: పరిగి డీఎస్పీగా శ్రీనివాస్‌ను నియమిస్తూ పోలీసు ఉన్నతాధికారులు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. పరిగి సీఐ గా విధులు నిర్వహిస్తూ ఇటీవలే ఆయన డీఎస్పీగా పదోన్నతి పొందారు. అనంతరం లగచర్ల ఘటన నేపథ్యంలో అదనపు డీఎస్పీగా పరిగికి రాగా.. పరిగి డీఎస్పీగా విధులు నిర్వహిస్తున్న కరుణసాగర్‌రెడ్డిపై బదిలీ వేటు పడింది. ఆయన్ను డీజీపీ కార్యాలయానికి అటాచ్ చేస్తూ అధికారులు ఉత్వర్వులు జారీ చేశారు. అదనపు డీఎస్పీగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్‌కు పూర్తి బాధ్యతలు అప్పగించారు.

పాలిటిక్స్ @ లగచర్ల

- సీఎం నియోజకవర్గం కావడంతో దేశవ్యాప్తంగా హాట్ టాపిక్
- మైలేజీ పెంచుకునేందుకు ప్రయత్నిస్తున్న ప్రతిపక్షాలు
- రైతులకు మద్దతుగా నిలుస్తున్న బీజేపీ, బీఆర్ఎస్
- పరామర్శలకు జాతీయ స్థాయి నేతలు



లగచెర్ల గ్రామ ముఖ చిత్రం

దుద్యాల్: మండల పరిధిలోని లగచెర్ల గ్రామం ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది. రాజకీయ నాయకులకు, మీడియా ఛానళ్లకు సైతం తెలియని ఈ గ్రామం ఒక్క సారిగా దేశ వ్యాప్తంగా మార్మోగుతోంది. ప్రభుత్వం ఫార్మా కంపెనీ ఏర్పాటుకు సంకల్పించిన నాటి నుంచి ఇందుకు వ్యతిరేకంగా మండల పరిధిలోని హకీంపేట్, పోలేపల్లి గ్రామాల్లో ధర్నా చేసినప్పటికీ పట్టించుకున్న వారే లేరు. ఫార్మా కంపెనీ ఏర్పాటులో భూములు కోల్పోతున్న గ్రామాల్లో లగచర్ల ఒకటి. ఈ పోరాట క్రమంలో ఈ నెల 11న రైతులకు, అధికారుల మధ్య జరిగిన గొడవతో దేశం కళ్లన్నీ లగచర్ల వైపు మళ్లాయి. 11న జిల్లా స్థాయి అధికారులు కలెక్టర్ ప్రతీక్‌జైన్, అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, తాండూరు సబ్-కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, కడా ప్రత్యేకాధికారి వెంకట్ రెడ్డి, తహసీల్దార్ కిషన్‌తో పాటు పలువురు రెవెన్యూ అధికారులు లగచర్ల రైతులతో ప్రజాభిప్రాయ సేకరణ సమావేశం ఏర్పాటు చేశారు. గ్రామానికి 2కిలో మీటర్ల దూరంలో నిర్వహించిన ఈ సమావేశానికి హాజరయ్యేందుకు రైతులు ఆసక్తి చూపలేదు. సమావేశానికి ఎవరూ రాకపోవడంతో కలెక్టర్ ప్రస్తుతం ఏ-2 నిందితుడిగా ఉన్న బోగమోని సురేశ్ అనే వ్యక్తిని పిలిపించి మాట్లాడారు. దీంతో ఆయన రైతుల వద్దకే అధికారులు రావాలని కోరడంతో అక్కడికి చేరకున్నారు. అధికారులు వచ్చిన వెంటనే రైతులు దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో కలెక్టర్ ప్రతీక్ జైన్, కడా ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డిపై రైతులు దాడికి పాల్పడ్డారు. దీంతో టీవీ, పేపర్లలో వార్తలు పబ్లిష్ కావడంతో హాట్ టాపిక్‌గా మారింది. అదే రాత్రి రైతులను పోలీసులు అరెస్ట్ చేయడంతో మరింత ఉద్రిక్తత నెలకొంది. లగచర్ల గ్రామం ముఖ్యమంత్రి నియోజకవర్గంలో ఉండడంతో ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీలు రేవంత్‌రెడ్డి టార్గెట్‌గా విమర్శనాస్త్రాలు ఎక్కుపెట్టారు. దీంతో కింది స్థాయి నాయకుల నుంచి ఎమ్మెల్యేలు, ఎంపీల వరకు నాయకులంతా లగచర్ల ఘటనపై మాట్లాడుతూ హైప్ పెంచుకుంటున్నారు.



లగచెర్ల గ్రామ పంచాయతీ కార్యాలయం

రైతులకు మద్దతుగా ప్రతిపక్షాలు

లగచర్ల ఘటనను ప్రతిపక్షాలు పూర్తి స్థాయిలో వినియోగించుకుంటున్నాయి. ఫార్మా కంపెనీ వద్దు అని వ్యతిరేకిస్తే రెతులపై ప్రభుత్వం అక్రమంగా కేసులు పెడుతుందనే విషయంపై నిత్యం ఏదో ఓ పార్టీ నాయకులు, సంఘాల నాయకులు స్పందిస్తూ రైతులకు మద్దతుగా నిలుస్తున్నారు. బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు గ్రామానికి వచ్చి ఫార్మా బాధిత కుటుంబాలను పరామర్శించేందుకు వస్తుంటే వారిని అడ్డుకుంటున్నారు. అదే అదునుగా భావించిన ప్రధాన ప్రతిపక్షాలు కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పిస్తూ ప్రజల్లో పరపతి పెంచుకుంటున్నారు.

ఎవరికి లాభం.. ఎవరికి నష్టం

ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గం ఘటన కావడంతో హాట్ టాపిక్ మారింది. లగచెర్ల ఘటనపై రాజకీయ పార్టీలు స్పందిస్తూ రైతులు పక్షాన పోరాడుతుండడం చూస్తుంటే బీజేపీ, బీఆర్ఎస్ తమ పట్టును పెంచుకునేందుకు యత్నిస్తున్నాయని నియోజకవర్గ ప్రజలు అనుకుంటున్నారు. ఈ ఘటనతో నియోజకవర్గంతో పాటుగా రాష్ట్ర వ్యాప్తంగా అధికార పార్టీ గ్రాఫ్ తగ్గుతోందని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఘటన ఆధారంగా చేసుకుని రైతుల పక్షాన పోరాడుతున్న బీజేపీ, బీఆర్ఎస్‌లకు కొంత సానుకూల పవనాలు వీస్తున్నాయని గుసగుసలాడుతున్నారు. ఈ ఘటన ఓ కొలిక్కి వచ్చే వరకు ఏ పార్టీలకు నష్టమో.. ఏ పార్టీలకు లాభం చేకూరుతుందో వేచి చూడాల్సిందే..



తాండూరు పట్టణంలోని ఓ పరీక్షా కేంద్రం వద్ద సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్

ముగిసిన గ్రూప్-3

- రెండో రోజు 43.8శాతం హాజరు
- 1,806 మంది గైర్హాజరు
- పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన సబ్-కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్

తాండూరు టౌన్: గ్రూప్-3 పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. పట్టణంలో 3,215 మంది అభ్యర్థులకుగాను 11 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. సోమవారం నిర్వహించిన పరీక్షకు 1,806 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. కేవలం 43.8 శాతం మంది మాత్రమే పరీక్ష రాశారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. పట్టణంలోని కేంద్రాలను తాండూరు సబ్-కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ తనిఖీ చేశారు.

ఏర్పాట్ల పరిశీలన


పూడూరు: మండల పరిధిలోని ఎన్కేపల్లి మోడల్ స్కూల్‌లో నిర్వహిస్తున్న గ్రూప్-3 పరీక్ష కేంద్రాన్ని సోమవారం కలెక్టర్ ప్రతీక్‌జైన్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పరీక్ష కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలించారు. పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. కలెక్టర్ వెంట ట్రెయినీ కలెక్టర్ ఉమాహారతి పాల్గొన్నారు.



కళాకారుల ఆట-పాట

ప్రభుత్వానికి సహకరించాలి

- ప్రజాపాలన విజయోత్సవాల్లో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్
- హాజరైన అధికారులు, ప్రజాప్రతినిధులు



మాట్లాడుతున్న స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

కొడంగల్: మన మంచి కోసం.. మన బిడ్డల భవిష్యత్ కోసం అహర్నిశలు కృషి చేస్తున్న ప్రజా ప్రభుత్వానికి ప్రజలందరూ అండగా ఉండాలని శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. సోమవారం పట్టణంలోని రాఘవేంద్ర గార్డెన్స్‌లో ప్రజా పాలన విజయోత్సవాలను జిల్లా అధికారులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన స్పీకర్ మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. గత ప్రభుత్వం హయాంలో ఒక కుటుంబం అధికార, ధన దాహానికి తెలంగాణ ఆగమైందని ఆరోపించారు. రాష్ట్రాన్ని అప్పులపాలు జేసి ఆగం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు మార్పు కోరుకునే కాంగ్రెస్‌కు పట్టం కట్టారన్నారు. నమ్ముకున్న ప్రజలకు న్యాయం చేసేందుకు అహర్నిశలు శ్రమిస్తున్నామన్నారు. పేదలు, రైతులు, మహిళలు, దళితులు, గిరిజనులు, మైనారిటీ, బడుగు బలహీన వర్గాల బాగు కోసం పని చేస్తున్నామని చెపప్పారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడి డిసెంబర్ 7 నాటికి ఏడాది పూర్తి అవుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రమాణ స్వీకారం చేసిన 48 గంటల్లోనే ఆరు గ్యారంటీల్లో రెండు గ్యారంటీలను అమలు చేశామని గుర్తు చేశారు. రూ.500కు వంట గ్యాస్ సిలిండర్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అమలు చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎనుముల తిరుపతిరెడ్డి, ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, సబ్-కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, ట్రెయినీ కలెక్టర్ ఉమా హారతి, సంగీత నాటక అకాడమీ చైర్‌పర్సన్ అలేఖ్య పుంజాల, ఫైనాన్స్ కమిషన్ సభ్యులు రమేశ్, ఆర్య వైశ్య కార్పొరేషన్ చైర్ పర్సన్ కల్వ సుజాత, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఉషారాణి, ఏఎంసీ చైర్మన్ అంబయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుల ఆటపాటలు ఆహుతులను అలరించాయి.



విజయోత్సవాలకు హాజరైన ఎస్పీ నారాయణరెడ్డి, కలెక్టర్ ప్రతీక్‌జైన్, అలేఖ్య పుంజాల

భూములిచ్చేది లేదు

- ఫ్యూచర్ సిటీ రహదారి భూ బాధితుల తీర్మానం
- భూమికి భూమి ఇచ్చి తీరాల్సిందే
- లేదంటే మార్కెట్ ధర ప్రకారం పరిహారం చెల్లించాలి
- తేల్చి చెప్పిన రైతులు



కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రం అందిస్తున్న రైతులు

కందుకూరు: ఫ్యూచర్ సిటీ రహదారి నిర్మాణం కోసం భూములు ఇచ్చేది లేదని బాధిత రైతులు తేల్చి చెప్పారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ నారాయణరెడ్డి, ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ గోపాల్‌కు వినతిపత్రాలు అందించారు. అంతకు ముందు రాచలూరులో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా భూములు కోల్పోతున్న వారందరినీ ఒప్పించిన తర్వాతే భూసేకరణ చేపట్టాలని తీర్మానించారు. కందుకూరు, యాచారం, కడ్తాల్ మండలాల్లో గత ప్రభుత్వం ఫార్మాసిటీ కోసం సేకరించిన భూముల్లో ప్రస్తుత ప్రభుత్వం ఫ్యూచర్ సిటీ నిర్మించడానికి సిద్ధమైంది. అందుకు సంబంధించి ఓఆర్‌ఆర్ 13 ఎగ్జిట్ నుంచి బేగరికంచె పరిధిలో నిర్మిస్తున్న స్కిల్స్ యూనివర్సిటీ వరకు తొలి విడతలో 300 అడుగుల రహదారి నిర్మించడానికి భూసేకరణ చేపట్టింది. ఇటీవల గ్రామాలు, సర్వే నంబర్ల వారీగా ఏయే భూముల నుంచి ఎంత మేర సేకరించనుందో ప్రకటించింది. రెండు రోజులుగా రెవెన్యూ అధికారులు ఆయా భూముల్లో సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేసే పనులు చేపట్టారు. పనులు చేస్తున్న అధికారులను ఇటీవల రాచులూరు రెవెన్యూలో రైతులు అడ్డుకున్న విషయం విధితమే.

నష్టపోకుండా చూడాలి

శ్రీశైలం రహదారిని విస్తరించి గతంలో కొత్తూరు గేట్ నుంచి నిర్మించిన 200 అడుగుల రహదారిని ఉపయోగించుకోవచ్చని సూచించారు. దీంతో తాము భూములు కోల్పోవాల్సిన అవసరం ఉండదని తెలిపారు. కొందరి స్వార్థ ప్రయోజనాల కోసం రైతులంతా నష్టపోకుండా ప్రభుత్వం ఆలోచించాలన్నారు. తమ పొలాలు ఇవ్వడానికి ఎవరూ సుముఖంగా లేరని స్పష్టం చేశారు. భూమికి భూమి లేదంటే ప్రస్తుతం మార్కెట్‌లో ఎకరం రూ.4కోట్ల నుంచి రూ.5 కోట్లు ధర పలుకుతోందని.. దాని ప్రకారం పరిహారమా అనేది రైతులను ఒప్పించి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

తెలియకుండానే సర్వే



మేము ముగ్గురు అన్న దమ్ములం. మాకు నాలుగు ఎకరాల భూమి ఉంది. ఆ భూమిపైనే ఆధారపడి జీవిస్తున్నాం. అందులో ఎకరం అమ్మి ఆడపిల్లల పెళ్లిళ్లు చేద్దామనుకున్నాం. ఇప్పుడు ఫ్యూచర్ సిటీ రహదారిలో మా భూమి అంతా పోతుంది. మాకు తెలియకుండానే మా భూమిలో సర్వే చేశారు. ఎట్టి పరిస్థితుల్లో భూమి ఇచ్చేది లేదు.

– వట్నాల రఘుపతి, రైతు, రాచలూరు

రెండున్నర ఎకరాలు పోతుంది



మా అమ్మగారి పేరుతో ఉన్న రెండున్నర ఎకరాల భూమి ఫ్యూచర్ సిటీ రహదారి నిర్మాణంలో పోతుంది. 300 అడుగుల రహదారికి బదులు 150 అడుగుల రహదారి నిర్మిస్తే మా భూమి కొంతైనా మిగులుతుంది. బహిరంగ మార్కెట్ ప్రకారం ఎకరానికి రూ.5 కోట్ల చొప్పున చెల్లిస్తే మా భూమి ఇస్తాం. లేదంటే అంగీకరించేది లేదు.

– ధనుంజయ్‌గౌడ్, రైతు, రాచలూరు

భూమికి భూమి కావాలి



మాకు ఎకరం భూమి ఉంది. అధికారులు మార్కింగ్ చేసిన ప్రకారం అది కాస్తా ఫ్యూచర్ సిటీ రోడ్డు నిర్మాణంలో పోతుంది. ఎక్కడా లేని విధంగా 300 అడుగుల రహదారి ఎందుకు నిర్మిస్తున్నారో అర్థం కావడం లేదు. మాకు కచ్చితంగా భూమికి భూమి ఇవ్వాల్సిందే. లేకపోతే భూమి ఇచ్చేది లేదు.

– యాదయ్య, రైతు, రాచలూరు

రాష్ట్రంలో డైవర్షన్ పాలిటిక్స్

- బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల రామచంద్రా రెడ్డి

తుర్కయంజాల్: రాష్ట్రంలో డైవర్షన్ పాలిటిక్స్‌కు సీఎం రేవంత్ రెడ్డి తెరలేపాడని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి విమర్శించారు. మన్నెగూడలోని వేద కన్వెన్షన్ హాల్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు అనేక హామీలిచ్చి అధికారంలోకి వచ్చిందని.. 11 నెలలు గడుస్తున్నా ఏ ఒక్కటీ నెరవేర్చలేదని అన్నారు. హామీల అమలు గురించి బీజేపీ ప్రశ్నిస్తుండటంతో సీఎం హైడ్రా, మూసీ ప్రక్షాళన పేరుతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాడని దుయ్యబట్టారు. తాజాగా లగచర్ల ఘటన కూడా ఇందులో భాగమేనని అన్నారు. ఇటీవల బీజేపీకి చెందిన 20 మంది నాయకులు మూసీ పరీవాహక ప్రాంతంలోని ప్రజలతో కలి సి నిద్ర చేశామని.. స్వయంగా వారి సమస్యలు అడిగి తెలుసుకున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు ఆ ప్రాంత ప్రజలతో చర్చించకుండానే ఏకపక్షంగా మూసీ పునరుజ్జీవం పేరిట పేదల ఇళ్లను కూలగొట్టే కార్యక్రమానికి తెరలేపారని మండిపడ్డారు. 1000 అడుగుల విస్తీర్ణంలో ఉన్న మూసీ నదిలో 300 ఫీట్ల వెడల్పుతో రిటైనింగ్ వాల్ కట్టి సమస్యకుపరిష్కారం చూపొచ్చని, మిగిలిన దాంట్లో బ్యూటిఫికేషన్ వంటి పనులు చేపట్టుకోవచ్చని సూచించారు. గంగా నది ప్రక్షాళనకు రూ. 38 వేల కోట్లను ఖర్చు చేశారని కేవలం 52 కిలో మీటర్ల మూసీ నది కోసం రూ.1.50 లక్షల కోట్లు ఎలా అవుతుందని నిలదీశారు. ఢిల్లీలోని కాంగ్రెస్ పార్టీకి మూటలను పంపించేందుకే ఈ వ్యవహారం అని ఆరోపించారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారం చేపట్టాక ఎయిర్ పోర్టులు, రైల్వే స్టేషన్‌లు, జాతీయ రహదారుల నిర్మాణం శరవేగంగా చేపడుతోందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కాంగ్రెస్ నాయకులు విమర్శలు మానుకుని, క్షేత్ర స్థాయిలో ప్రజల సమస్యలు తెలుసుకోవాలని హితవు పలికారు. నాయకులు రాణి రుద్రమ, బండారు విజయలక్ష్మి, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

25న లక్ష బిల్వార్చన

కుల్కచర్ల: పాంబండ రామలింగేశ్వర దేవస్థానంలో ఈ నెల 25న లక్ష బిల్వార్చన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ సుధాకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో దంపతులు పాల్గొనాల్సి ఉంటుందని చెప్పారు. వివరాలకు ఆలయ అర్చకులు పాండును సంప్రదించాలని సూచించారు.

వానరంపై వీధి కుక్కల దాడి

కళేబరాన్ని ఖననం చేసిన గ్రామస్తులు

దోమ: వీధి కుక్కల దాడిలో వానరం మృత్యువాత పడిన ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. మండల కేంద్రంలో వానరాల గుంపులో ఓ కోతిపై వీధి కుక్కలు దాడి చేయంతో తీవ్రంగా గాయపడింది. నీరు, ఆహారం అందించినా బతకలేదు. దీంతో చలించిన గ్రామస్తులు శ్రీనివాస్, దస్తయ్య, మల్లేశ్, జగన్, అంజి తదితరులు వానరాన్ని ఖననం చేశారు.

చెట్టుపై నుంచి పడి కూలీ మృతి


హుసేనప్ప (ఫైల్)

తాండూరు రూరల్: చెట్టు కొమ్మలు నరుకుతున్న కూలీ చెట్టుపై నుంచి పడి మృతి చెందాడు. ఈ ఘటన కరన్‌కోట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన జోగు హుసేనప్ప(53) కూలి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం గ్రామంలోని కొత్తమల్లి రంగారెడ్డి ఇంట్లో కూలీ పనికి వెళ్లాడు. ఇంటి ఆవరణలోని టేకు చెట్టు ఎక్కి కొమ్మలు నరుకుతుండగా ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. గమనించిన స్థానికులు వెంటనే తాండూరులోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న హుసేనప్ప పరిస్థితి విషమించి మృతిచెందాడు. మృతుడి సోదరుడు జోగు దస్తప్ప సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో ఉంది.

ఆగిఉన్న లారీని ఢీకొట్టిన బైక్

ఒకరు మృతి.. ఇద్దరికి గాయాలు


సురేశ్(ఫైల్)

కొడంగల్ రూరల్: ఆగి ఉన్న లారీని బైక్ ఢీకొట్టడంతో ఒకరు మృతి చెందగా మరో ఇద్దరు గాయపడ్డారు. ఈ ఘటన సంఘటన నందిగామ గేటు సమీపంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్ఐ జీవీ సత్యనారాయణ తెలిపిన ప్రకారం.. కొడంగల్‌లో నిర్వహిస్తున్న సదర్ వేడుకలు చూసేందుకు దౌల్తాబాద్ మండల కేంద్రానికి చెందిన సురేశ్(17), అలీ, మహేందర్ బైక్‌పై వచ్చారు. తిరుగు ప్రయాణంలో నందిగామ గేటు సమీపంలో ఆగి ఉన్న లారీని వెనక నుంచి ఢీకొట్టారు. దీంతో సురేశ్ అక్కడికక్కడే మృతిచెందగా అలీ, మహేందర్ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులు ఇద్దరిని కొడంగల్ ప్రభుత్వాస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స చేశారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. మృతుడి తల్లి వెంకటమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం



తాండూరు రూరల్: ధాన్యం కొనుగోలులో జరుగుతున్న జాప్యం నేపథ్యంతో 'కిలో కొంటే ఒట్టు' అనే శీర్షికన సోమవారం 'సాక్షి'లో ప్రచురించిన కథనానికి డీసీఎంఎస్ అధికారులు స్పందించారు. సోమవారం సాయంత్రం నుంచి వరి కొనుగోళ్లు ప్రారంభించినట్లు బ్రాంచి ఇన్‌చార్జి ఎల్లయ్య తెలిపారు. రైతులకు సరిపడా గోనే సంచులు పంపిణీ చేశామని వెల్లడించారు. మొదటి రోజు 300 క్వింటాళ్లు కొనుగోలు చేశామని పేర్కొన్నారు. రైతులు ప్రైవేటు వ్యక్తులకు ధాన్యం విక్రయించరాదని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి, మద్దతు ధర పొందాలని సూచించారు. క్వింటాల్ ఏ గ్రేడ్ రకానికి రూ.2320, బీ గ్రేడ్‌కు రూ.2300 ధరను చెల్లిస్తున్నట్లు చెప్పారు.

అల్లాపూర్‌లో..

అల్లాపూర్ వెళ్లేమార్గం పెట్రోల్ సమీపంలో సన్న వడ్ల కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసినట్లు డీసీఎంఎస్ బ్రాంచ్ ఇన్‌చార్జి ఎల్లయ్య తెలిపారు. మండల పరిధి గ్రామాల్లో సన్నవడ్లు పండించిన రైతులు ఈ కేంద్రంలోనే విక్రయించాలన్నారు. ఏ గ్రేడ్ వడ్లు క్వింటాల్‌కు ప్రభుత్వం రూ.2320 చెల్లిస్తుందని, దాంతో పాటే బోనస్‌గా రూ.500 రైతు ఖాతాలో జమ చేస్తుందని స్పష్టంచేశారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

జంట హత్యలపై ఏసీపీ ఆరా

మాడ్గుల: మండల పరిధిలో నాగిళ్ల గ్రామంలో ఆదివారం రాత్రి జంట హత్యలు కలకలం రేపిన సంగతి తెలిసిందే. సంఘటనా స్థలాన్ని సోమవారం ఇబ్రహీంపట్నం ఏసీపీ రాజు పరిశీలించారు. వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆదివారం రాత్రి పరస్పర దాడిలో బావబావమరుదులు బర్కం యాదయ్య(54), గడ్డం శ్రీను (40) మృతి చెందిన విషయం విధితమే. మాజీ సర్పంచ్ రామేశ్వర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


ప్యాసింజర్ రైళ్ల కోసం నిరీక్షిస్తున్న భక్తులు


భక్తులు లేక బోసిపోతున్న క్రీస్తు ప్రధాన శిలువ ప్రాంగణం

జన జాతర ప్రాంగణం ఖాళీ

గమ్యస్థానాలకు చేరుకున్న భక్తజనం

ధారూరు: ధారూరు స్టేషన్ దోర్నాల్ గ్రామంలో ఆరు రోజుల పాటు జరిగిన మెథడిస్ట్ క్రైస్తవ జాతర ఆదివారం ప్రశాంతంగా ముగింది. ఆదివారం భక్తజనంతో నిండిన ప్రాంగణం.. సోమవారం సాయంత్రానికి ఖాళీ అయింది. అయినప్పటికీ మరి కొందరు భక్తులు దైవ దర్శనం కోసం వచ్చారు. ఉత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన దుకాణాలు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. భక్తుల తిరుగు ప్రయాణంలోనూ తమకు కావాల్సిన సరుకులు కొనుగోలు చేశారు. అనంతరం భక్తులు నాందెడ్- బెంగళూర్, బెంగళూర్- నాందెడ్ ఎక్స్‌ప్రెస్, తదితర ప్యాసింజర్ రైళ్లలో వారివారి గమ్యస్థానాలకు వెళ్లిపోయారు. మరికొందరు వికారాబాద్, తాండూరుకు బస్సులు, ఇతర ప్రైవేటు వాహనాల్లో వెళ్లి, అక్కడి నుంచి కర్ణాటక, మహారాష్ట్ర, ఉమ్మడి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు తరలి వెళ్లారు. దీంతో వారం రోజుల పాటు భక్తజనంతో కళకళలాడిన ధారూరులో నిశ్శబ్ద వాతావరణం నెలకొంది.

మాలలపై చిన్నచూపు తగదు

- చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి
- మాలల సింహగర్జన సభ వాల్ పోస్టర్ ఆవిష్కరణ


మాలల సింహగర్జన వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న వివేక్

పరిగి: అన్ని రాజకీయ పార్టీలు మాలలను చిన్న చూపు చూస్తున్నాయని చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి ఆరోపించారు. డిసెంబర్ 1న నిర్వహించే మాలల సింహగర్జన బహిరంగ సభ వాల్ పోస్టర్‌ను సోమవారం పట్టణ కేంద్రంలో ఆవిష్కరించారు. అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మాలలు ఇప్పుడిప్పుడే వస్తున్నారన్నారు. మాలలు రాజకీయంగా బలంగా ఉన్నారని తెలిపేందుకే ఈ సభ నిర్వహిస్తున్నామని తెలిపారు. నగరంలోని ఫరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించే మాలల సింహగర్జన సభలో ప్రతిఒక్కరూ పాల్గొనాలని సూచించారు. తెలంగాణలో దాదాపుగా 30లక్షల మంది మాలలు ఉన్నారన్నారు. రాష్ట్రంలో రెండో అతిపెద్ద కులంగా మాలలు నిలుస్తున్నారని, ప్రభుత్వాలు, పార్టీలు వీరిని విస్మరించడం సరికాదని హితవు పలికారు. జాగో మాల నినాదంతో రాష్ట్రంలోని వారంతా కదులుతున్నారని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు వెంకటయ్య, నాయకులు కోళ్ల యాదయ్య, శివరాజ్, ఆనందం, వెంకట్, నర్సింహులు, సైదుపల్లి రాములు, లక్ష్మయ్య, విజయ్, వీరేష్,లక్ష్మణ్, శ్రీను, యావయ్య, నర్సింహులు,అబ్రహం, మహేశ్, రామకృష్ణ,మంచన్‌పల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఫార్మా పేరుతో భూములు లాక్కునే కుట్ర

- పోలీసులను ఉసిగొల్పి అక్రమ కేసులు బనాయిస్తున్నారు
- జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు వ్యవసాయ, కార్మిక సంఘాల ఫిర్యాదు


ఫిర్యాదు పత్రాన్ని చూపుతున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

దుద్యాల్: లగచెర్ల ఘటనలో వ్యవసాయ, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ప్రభుత్వం, పోలీసులపై జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఆన్‌లైన్‌లో చేసిన ఫిర్యాదు ప్రతిని సోమవారం మీడియాకు చూపించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటయ్య, సీపీఎం జిల్లా నాయకుడు బుస్స చంద్రయ్య మాట్లాడుతూ.. లగచెర్ల, రోటిబండతండా, పులిచెర్లకుంట తండా, పోలేపల్లి, హకీంపేట్ గ్రామాల్లో ఫార్మా కంపెనీ ఏర్పాటు పేరుతో ప్రభుత్వం 1,273.24 ఎకరాల వ్యవసాయ భూమిని తీసుకునేందుకు కుట్ర చెస్తోందన్నారు. లగచర్ల ఘటన తర్వాత పోలీసులను ఉసిగొల్పి అమాయక గిరిజనులపై కేసులు పెట్టి వేధిస్తున్నారని తెలిపారు. మూడు రోజుల పాటు దుద్యాల్, కొడంగల్, బొంరాస్‌పేట్ మండలాల్లో ఇంటర్‌నెట్ సేవలు నిలిపేసి, ప్రజలను ఇబ్బందులకు గురి చేశారన్నారు. తమ ఫిర్యాదును స్వీకరించిన కమిషన్ కేసు నంబర్ 19141/ఐఎన్/2024ను కేటాయించినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ హక్కుల జిల్లా అధ్యక్షుడు చంద్రయ్య, నాయకులు లక్ష్మయ్య, అనంతయ్య, జయనంద్, తదితరులు పాల్గొన్నారు.

మృత్యువులోనూ వీడని స్నేహబంధం

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల దుర్మరణం


తుప్పరి రాజు (ఫైల్)


సిద్ధిగారి మహేశ్ (ఫైల్)

కడ్తాల్: రోడ్డు ప్రమాద రూపంలో మృత్యువు ఇద్దరు స్నేహితుల ప్రాణాలను బలితీసుకుంది. ఆదివారం అర్ధరాత్రి మండల కేంద్రం సమీపంలోని టోల్‌గేట్ సమీపంలో ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన సంఘటనలో బైక్‌పై వెళ్తున్న ఇద్దరు మిత్రులు మృతి చెందారు. సీఐ శివప్రసాద్ కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన తుప్పరి రాజు (24), సిద్ధిగారి మహేశ్ (24) చిన్న నాటి నుంచి స్నేహితులు. ప్రైవేట్‌లో ఉద్యోగాలు చేస్తూ కలిసి మెలసి ఉండేవారు. ఆమనగల్లు పట్టణంలో ఆదివారం రాత్రి జరిగిన ఓ ఫంక్షన్‌కు ఇద్దరూ కలిసి బైక్‌పై వెళ్లారు. ఫంక్షన్ ముగిసిన తర్వాత మిత్రులిద్దరూ అదే రాత్రి ఒంటి గంట సమయంలో స్వగ్రామానికి బయలుదేరారు. మార్గమధ్యలో కడ్తాల్ టోల్‌గేట్ సమీపంలో జాతీయ రహదారిపై ఎలాంటి ఇండికేటర్స్ లేకుండా లారీని డ్రైవర్ అజాగ్రత్తగా నిలిపి ఉంచాడు. చీకట్లో ఆగి ఉన్న లారీ సరిగ్గా కనిపించకపోవడంతో బైక్ నడుపుతున్న తుప్పరి రాజు వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో మిత్రులిద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద వివరాలు సేకరించారు. మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రాజు సోదరుడు తుప్పరి మహేశ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఇద్దరు యువకుల మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. కాగా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, పీసీసీ అధికార ప్రతినిధి బాలాజీసింగ్ సోమవారం ఉదయం కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి మృతదేహాలను పరిశీలించారు. పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి
- ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం


ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కడ్తాల్: ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని సింగిల్ విండో సబ్ సెంటర్ వద్ద, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆమనగల్లు ఆధ్వర్యంలో ఏర్పా టు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సింగిల్‌విండో చైర్మన్ గంప వెంకటేశ్‌గుప్తాతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి, మద్దతు ధర పొందాలని సూచించారు. సన్న వడ్లకు క్వింటాకు రూ.500 అదనంగా ప్రభుత్వం ప్రోత్సాహక బోనస్ అందిస్తోందని తెలిపారు. ధాన్యంలో తరుగు పేరుతో కోతలు లేకుండా చివరి గింజవరకు కొనుగోలు చేస్తామని భరోసా కల్పించారు. కొనుగోలు కేంద్రాల్లో విక్రయించిన ధాన్యానికి 48 గంటల్లోగా డబ్బులు చెల్లించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కొంత మంది చేస్తున్న అసత్య ప్రచారాలను నమ్మవద్దని సూచించారు. ప్రభుత్వం ప్రకటించిన మేరకు ధాన్యంలో తేమ శాతం ఉండేలా చూసుకోవాలని సూచించారు. రైతులకు అండగా ఉంటామని, ఏ చిన్న సమస్య తలెత్తిన తక్షణమే స్పందిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తుందని పేర్కొన్నారు. డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్‌గుప్తా, పీసీసీ సభ్యులు శ్రీనివాస్‌గౌడ్, సింగిల్ విండో వైస్ చైర్మన్ సత్యం, మాజీ వైస్‌ఎంపీపీ ఆనంద్, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, వేణుగోపాల్, శేఖర్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహా, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీచ్యానాయక్ నాయకులు ఉన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



అనంతగిరి: గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం వికారాబాద్‌లో చోటు చేసుకుంది. సీఐ భీంకుమార్ తెలిపిన ప్రకారం.. పట్టణంలోని ఆలంపల్లి ప్రధాన రోడ్డులో వేంకటేశ్వర కాలనీ కమాన్ సమీపంలో విజయ బేకరీ ఎదుట ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. అక్కడికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించారు. అనంతరం మృతదేహాన్ని వికారాబాద్ ప్రభుత్వాస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదన్నారు. బూడిద రంగు ప్యాంటు, తెలుపు రంగు చొక్కా కుడిచేతికి ఎర్రటి దారం ఉందన్నారు. మృతుడి సంబంధీకులు ఎవరైనా ఉన్నా.. గుర్తించినా 87126 70030 నంబర్‌లో సంప్రదించాలని పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో టీచర్‌కు తీవ్ర గాయాలు

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రత్యేక తరగతులకు హాజరయ్యేందుకు వెళ్తుండగా రోడ్డు ప్రమాదంలో ప్రభుత్వ ఉపాధ్యాయురాలికి తీవ్ర గాయలయ్యాయి. ఈ సంఘటన నాగన్‌పల్లి సమీపంలో చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. తుర్కయంజాల్‌లో నివసించే మంగ జెడ్పీహెచ్ఎస్ నాగన్‌పల్లిలో హిందీ టీచర్‌గా పని చేస్తోంది. రోజుమాదిరిగానే సోమవారం ఉదయం పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు బోధించేందుకు ఉదయం 7 గంటలకు ఇంట్లో నుంచి ద్విచక్రవాహనంపై వెళ్లింది. 7.45 గంటలకు నాగన్‌పల్లి సమీపంలోని రోడ్డు మలుపు వద్ద వాహనం స్కిడ్‌కావడంతో కిందపడిపోయింది. దీంతో తల, భుజం, పక్కటెముకలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి వెంటనే ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మంగను పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్ యాదవ్, మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు డాక్టర్ వర్కాల పరమేష్, చంద్రశేఖర్ పరామర్శించారు.

వేడుకకు వెళ్తుండగా ప్రమాదం

ఇద్దరి దుర్మరణం


యాదగిరి, యాదయ్య మృతదేహాలు

ఆమనగల్లు: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఇద్దరు దుర్మరణం చెందారు. ఆమనగల్లు ఎస్ఐ వెంకటేశ్ కథనం ప్రకారం.. ఆమనగల్లు మండలం మంగళపల్లి పరిధిలోని చెన్నకేశవ కాలనీకి చెందిన వరికుప్పల యాదగిరి (45), మర్ల యాదయ్య (42) సోమవారం రాత్రి చుక్కాపూర్ సమీపంలోని ఫంక్షన్ హాల్‌లో బంధువుల వేడుకకు హాజరు కావడానికి ద్విచక్రవాహనంపై వెళ్తున్నారు. చింతలపల్లి సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నిద్రమత్తులో కింద పడి యువకుడి మృతి

ఇబ్రహీంపట్నం రూరల్: నిద్రమత్తులో ఇంటిపై కప్పు నుంచి పడి యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన ఆదివారం అర్ధరాత్రి ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఆదిబట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. తుక్కుగూడ మున్సిపల్ పరిధిలోని రావిర్యాలకు చెందిన గుంటి రాజు (27) ఆగఖాన్ అకాడమీలో బాల్‌బాయ్‌గా పని చేస్తుండేవాడు. ప్రతి రోజు ఇంటిపై నిద్రిస్తాడు. ఆదివారం రాత్రి ఇంటిపై పడుకొని ఉండగా అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో కింద పడినట్లు పెద్ద శబ్దం రావడంతో కుటుంబ సభ్యులు గమనించారు. తీవ్ర గాయాలతో రాజు అక్కడికక్కడే మృతి చెందాడు. సోమవారం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కంపెనీలు కావాలి..

- గిరిజన బతుకులు బాగుపడాలి
- అభివృద్ధిని అడ్డుకుంటున్న బీఆర్ఎస్
- జాతీయ ఎస్సీ,ఎస్టీ కమిషన్ బృందానికి గిరిజన నాయకుల వినతి


ఎస్సీ,ఎస్టీ కమిషన్ బృందానికి వినతిపత్రం అందజేస్తున్న గిరిజన నాయకులు

బొంరాస్‌పేట: వలసల జీవనం గడిపిన గిరిజనల బతుకుల్లో వెలుగులు తెచ్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషి చేస్తుండగా.. బీఆర్ఎస్ పార్టీ నేతలు అడ్డుకుంటున్నారని కాంగ్రెస్ ఎస్టీసెల్ మండల నాయకులు ఆరోపించారు. కావాలనే గిరిజన రైతులను రెచ్చగొట్టి, లగచర్ల దాడి ఘటనను జాతీయ స్థాయిలో వివాదం చేస్తూ.. అభివృద్ధిని అడ్డుకుంటున్నారని విమర్శించారు. గిరిజనులకు ఉద్యోగ, ఉపాధి కావాలంటే కంపెనీలు కావాలని కోరారు. ఈ మేరకు సోమవారం తుంకిమెట్ల వద్ద జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ బృందానికి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ నేతృత్వంలో ఇప్పుడిప్పుడే నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని, కంపెనీల ఏర్పాటుతో నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. ఇలా గిరిజనుల కోసం ఆరాటపడుతున్న సీఎం రేవంత్‌ను రాజకీయంగా ఎదుర్కోలేక, ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని అడ్డుకుంటున్న ప్రతిపక్ష నేతలపై చర్యలు తీసుకోవాలని కమిషన్ సభ్యులను కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో కాంగ్రెస్ ఎస్సీ నాయకులు దేశ్యానాయక్, సీతారాంనాయక్, సంతోష్‌నాయక్, గిరిజన నాయకులున్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం రైతు పక్షపాతి

తాండూరు ఏఎంసీ చైర్మన్ బాల్‌రెడ్డి


జుంటుపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న బాల్‌రెడ్డి

యాలాల: కాంగ్రెస్ సర్కారు రైతు పక్షపాతి అని, రైతు సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తాండూరు ఏఎంసీ చైర్మన్ పట్లోళ్ల బాల్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని జుంటుపల్లిలో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా బాల్‌రెడ్డి మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపారన్నారు. ధాన్యం విక్రయానికి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రైతులు దళారుల బారిన పడకుండా జాగ్రత్త పడాలన్నారు. మండల పరిధిలో సొసైటీ, డీసీఎంఎస్, ఐకేపీ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ మేకల రాజు, జుంటుపల్లి మాజీ సర్పంచ్ వెంకట్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

మాతృ హృదయం..

పరీక్ష రాసిన అమ్మ.. శిశువును ఆడించిన కానిస్టేబుల్


బాబును నిద్రపుచ్చుతున్న కానిస్టేబుల్ నర్సమ్మ

తాండూరు టౌన్: మాతృత్వం మమకారాన్ని మించింది లేదు. అయినప్పటికీ.. తల్లి పరీక్ష రాసేందుకు వెళ్లగా.. ఆమె తనయుడి ఆలనాపాలనా చూసి, మాతృప్రేమను పంచింది మహిళా కానిస్టేబుల్ నర్సమ్మ. గ్రూప్ 3 పరీక్ష నేపథ్యంలో తాండూరు పట్టణ కేంద్రం బాలికల జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన కేంద్రంలో అభ్యర్థి కృష్ణవేణి తన ఐదు నెలల బాబుతో సోమవారం పరీక్ష రాసేందుకు వచ్చారు. బాబును తీసుకుని లోపలికి వెళ్తుండగా.. ఏడవటం మొదలు పెట్టాడు. ఎంతకీ ఏడుపు ఆపక పోవడంతో అక్కడే విధి నిర్వహణలో ఉన్న బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో పనిచేసే కానిస్టేబుల్.. ఆ బాలుడిని ఎత్తుకోవడంతో ఏడుపు ఆపేశాడు. బాబును చూసుకుంటామని, పరీక్ష రాయండని ఆ కానిస్టేబుల్.. అభ్యర్థిని లోపలికి పంపించింది. పరీక్ష రాసి వచ్చేంత వరకు చిన్నారి కానిస్టేబుల్ ఒడిలో హాయిగా ఆడుకున్నాడు. తల్లిని మరిపించి, మురిపించి ఆలనాపాలన చూసిన కానిస్టేబుల్‌ను ఈ సందర్భంగా పలువురు అభినందించారు.

పెళ్లింట్లో భారీ చోరీ

133 తులాల బంగారం, 80తులాల వెండి, రూ.2.5లక్షల నగదు అపహరణ


వివరాలు అడిగి తెలుసుకుంటున్న నార్సింగి ఏసీపీ రమణగౌడ్

శంకర్‌పల్లి: పట్టణంలోని ఓ పెళ్లి ఇంట్లో ఆదివారం రాత్రి భారీ దొంగతనం జరిగింది. పెళ్లివారంతా హల్దీ వేడుకలో ఉండగా.. దుండగులు తమ పని తాము చేసుకొని వెళ్లిపోయారు. బాధితుల ఫిర్యాదుతో శంకర్‌పల్లి సీఐ శ్రీనివాస్‌గౌడ్, ఎస్ఐ సత్యనారాయణ వెంటనే పెళ్లింటికి చేరుకున్నారు. సమాచారం అందుకున్న నార్సింగి ఏసీపీ రమణగౌడ్ చోరీ జరిగిన ఇంటిని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. శంకర్‌పల్లి సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన పార్శి బాలకృష్ణ వ్యాపారవేత్త, రాజకీయ నాయకుడు. తన కూతురు వివాహం ఈనెల 20న ఉండడంతో ఆదివారం సాయంత్రం 5 గంటలకు ఇంటి బయట హల్దీ ఫంక్షన్ ఏర్పాటు చేసుకున్నారు. కుటుంబసభ్యులు, బంధువులు, స్నేహితులు వేడుక కోసం బయట ఉన్నారు. రాత్రి 11గంటల సమయంలో ఇంట్లోకి వెళ్లి.. వేసుకున్న నగలు పెడదామని చూసే సరికి లాకర్ తెరిచి ఉంది. అనుమానం వచ్చి మొత్తం పరిశీలించగా 133 తులాల బంగారం (17 ఆభరణాలు), 80 తులాల వెండి, రూ.రెండున్నర లక్షల నగదు కనిపించలేదు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వగా.. వారు వెళ్లి పరిశీలించారు. క్లూస్ టీం, ఫింగర్ ప్రింట్స్‌టీం, రాజేంద్రనగర్ సీసీఎస్ పోలీసులు సంయుక్తంగా దర్యాప్తు చేస్తున్నారు.

డ్వాక్రా సంఘాల సొమ్ము స్వాహా!

- ఫోర్జరీ సంతకాలతో బ్యాంకు నుంచి నిధుల డ్రా
- మల్కీజ్‌గూడ డ్వాక్రా మహిళల ఫిర్యాదు
- విచారణ చేపట్టిన అధికారులు
- రూ.20 లక్షల మేర కాజేసినట్టు గుర్తింపు

యాచారం: నకిలీ తీర్మానాలు.. ఫోర్జరీ సంతకాలు చేసి ఓ వీబీకే (విలేజ్ బుక్ కీపర్) ఎస్‌బీఐకి కన్నం పెట్టింది. డ్వాక్రా సంఘాల మహిళలు ప్రతి నెలా చెల్లించే రికవరీ చెల్లింపుల్లో తేడా రావడం గుర్తించి బ్యాంకు మేనేజర్ సెర్ప్ ఏపీఎంకు ఫిర్యాదు చేశారు. డ్వాక్రా సంఘాల మహిళల ఫిర్యాదు మేరకు అధికారు విచారణ చేపట్టగా ఓ వీబీకే రూ.లక్షలాది నిధులు స్వాహా చేసినట్లు వెలుగులోకి వచ్చింది. వివరాలివీ.. మండల పరిధిలోని మల్కీజ్‌గూడలో 45 గ్రామ సంఘాలు ఉన్నాయి. ఆర్థిక వ్యవహారాల పర్యవేక్షణకు విలేజ్ బుక్ పీపర్‌గా గ్రామానికి చెందిన వరికుప్పల రాణి విధులు నిర్వర్తిస్తోంది. డ్వాక్రా సంఘాల మహిళల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకున్న ఆమె గతేడాది అక్టోబర్ నుంచి నకిలీ తీర్మానాలు, స్టాంపులతో ఫోర్జరీ సంతకాలు చేసి యాచారం ఎస్‌బీఐలో పలు తేదీల్లో రూ.20 లక్షల వరకు వివిధ గ్రామాలకు చెందిన మహిళల బ్యాంకు ఖాతాలకు బదిలీ చేయించింది. అనుమానం వచ్చిన గులాబీ, ఇందిర తదితర గ్రూపులకు చెందిన మహిళలు కొద్ది రోజుల క్రితం యాచారం ఎస్‌బీఐ మేనేజర్ జాన్సీని కలిసి నిధుల డ్రాను పరిశీలించాలని కోరారు. వారి ఫిర్యాదు మేరకు రికార్డులను పరిశీలించగా అసలు విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో ఎస్‌బీఐ మేనేజర్ జాన్సీ యాచారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ

నిధుల బదిలీపై సోమవారం మల్కీజ్‌గూడలో అధికారులు విచారణ చేపట్టారు. ఎస్‌బీఐ మేనేజర్ జాన్సీ, సెర్ప్ ఏపీఎం సుదర్శన్‌రెడ్డి తదితరులు స్థానిక డ్వాక్రా సంఘం భవనంలో గ్రామంలోని డ్వాక్రా సంఘాల మహిళలతో సమావేశమయ్యారు. గ్రామంలో ఉన్న 45 గ్రూపుల్లో రెండు మూడేళ్లుగా తీసుకున్న రుణాలు, చెల్లిస్తున్న రికవరీపై రికార్డులు తనిఖీ చేశారు. అదే సమయంలో గ్రామంలోని మహిళలు పెద్ద సంఖ్యలో డ్వాక్రా సంఘం భవనం వద్దకు చేరుకున్నారు. వీబీకే వరికుప్పల రాణిని పిలిపించాలని డిమాండ్ చేశారు. సెర్ప్ అధికారులు, బ్యాంకు మేనేజర్‌తో వాగ్వాదానికి దిగారు. ఒక వీబీకే ఫోర్జరీ సంతకాలు, నకిలీ రికార్డులు సృష్టించి రూ.లక్షలాది నిధులు ఇతర మహిళల ఖాతాల్లోకి బదిలీ చేయిస్తుంటే ఏం పర్యవేక్షణ చేస్తున్నారని మండిపడ్డారు. వీబీకే స్వాహా చేసిన నిధులను తిరిగి చెల్లించే విధంగా కృషి చేస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో మహిళలు శాంతించారు.


నిధుల స్వాహాపై విచారణ చేపట్టిన అధికారులు